ఏడాది పాలన మోసాలమయం



రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వ ఏడాది పాలన మోసాలమయమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 19వ డివిజన్‌లో పరిశీలకుడు ఎన్ని ధనుంజయరావు, ఇన్‌చార్జి కొండాల గణేష్, ఆదివారంపేటలో పంకు ప్రసాద్, పొన్నాడ రుషి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, పార్టీ తూర్పుకాపు, కళింగ వైశ్య కుల విభాగ అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ ఇంటి తలుపు తట్టినా ప్రజలు సమస్యల్ని ఏకరవు పెడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు అమాంతం పెంచేశారని దుయ్యబట్టారు. డీసీసీబీ కాలనీలో ఏ వీధికి వెళ్లినా మట్టి రోడ్లు, కాలువలు లేని వీధులే దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు. కొండాల గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్మికులు వీధుల్లోకి వచ్చి పరిశుభ్రం చేసేవారని, కూటమి పాలనలో అవేమీ కనిపించడం లేదన్నారు. అంతేకాకుండా కాలనీ అంతా అంధకారం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, నాయకులు మొదలవలస రాజేంద్ర, దుంపల శ్రీనివాస్, దాసరి రాము, గద్దిబోయిన కృష్ణయాదవ్, రౌతు శంకరరావు, భరద్వాజ్, తంగి అప్పన్న, కర్నేన హరి, జలగడుగుల శ్రీనివాస్, కింజరాపు రమేష్, బగ్గు అసిరినాయుడు, సీర సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మోసాలను ప్రజలకు వివరిద్దాం



చంద్రయ్యపేటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఏడాది కాలంగా ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిద్దామని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ పిలుపునిచ్చారు. మండలంలోని చంద్రయ్యపేట, వెలగాడ గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ అధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ యువత, ఆడబిడ్డలు, రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాబు మోసాలకు బుద్ధి చెప్పాలి



తమ్మినాయుడుపేటలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎచ్చెర్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పాలని ఎచ్చెర్ల మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోర సాయిరాం అన్నారు. మండలంలోని తమ్మినాయుడుపేట, ఇబ్రహీంబాద్, పూడివలస, కుశాలపురం, దోమాం, జర్జాం గ్రామాల్లో బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. అవకాశం వచ్చిన రోజు ఖచ్చితంగా సమాధానం చెబుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతున్నారని దుయ్యబట్టారు.

కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, వైస్ ఎంపీపీ జరుగుళ్ల శంకరరావు, జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు, జిల్లా కార్యదర్శి అంబటి రాంబాబు, జిల్లా యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శి కొత్తకోట సూర్యారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బోర గోవిందరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు మాడుగుల జగదీష్, కోటిపాత్రుని హరికృష్ణ, ఎస్ఎస్ఆర్ పురం సర్పంచ్ దుంప చిన్నారెడ్డి, మండల పార్టీ జనరల్ కార్యదర్శులు కోన వరప్రసాద్, దుంప ఈశ్వరరెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి గవిరెడ్డి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రణస్థలం విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న రణస్థలం విద్యార్థులు

రణస్థలం: తమిళనాడు రాష్ట్రంలోని తిరుచూరుపల్లిలో జరిగిన ఆరో సౌత్‌జోన్ పెన్‌కాస్ సిలాట్(కరాటే) పోటీల్లో రణస్థలం విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు రణస్థలం పరశురామ యుద్ధ కళాక్షేత్రం నిర్వాహకుడు లింగాల ఈశ్వరరావు తెలిపారు. ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో విద్యార్థులు రెడ్డి యోగామృత, దున్నా సుచరిత, బోనెల నాగేశ్వరి, కె.సాయిజ్యోతిప్రకాశ్, సుమస్, కె.హరీష్, తాన సుదీప్, శంకర్‌లు ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నట్లు వెల్లడించారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: స్థానిక కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సహకారంతో సీపీఆర్‌పై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో సీపీఆర్ ఎలా చేయాలో జేసీఐ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వారి సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ కె.మోషీ తదితరులు పాల్గొన్నారు.

నేడు అసిరితల్లి ఆవేటి వారాలు



ముస్తాబైన ఆలయం

అరసవల్లి: అరసవల్లి, కాజీపేట గ్రామ దేవత అసిరితల్లి అమ్మవారి ఆవేటి వారాల పండుగ మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలతో పాటు మొక్కుల చెల్లింపునకు చర్యలు చేపట్టారు. ఆవేటి వారాల సందర్భంగా మహిళలు భారీగా తరలివచ్చి ముర్రాటలను సమర్పించి అమ్మవారికి శాంతి పూజలు చేయనున్నారు. అలాగే రైతులు కూడా తమ సామగ్రితో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేయనున్నారు. వీటికి గాను ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలతో పాటు మొక్కుల చెల్లింపులకు అనుమతి ఉంటుందని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలియజేశారు.

అభినందనలు



లక్ష్మణరావును సన్మానిస్తున్న ప్రజలు

ఎచ్చెర్ల: అతి చిన్న వయస్సులోనే వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా నియామకమైన లక్ష్మణరావుకు మురపాక ఎస్సీ కాలనీ ప్రజలు అభినందనలు తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలియజేశారు.

● పొలం బాట



నాగులవలస - లింగాపురం పరిధిలో ఎడ్లతో దమ్ము చేస్తున్న రైతు

మద్దువలస సాగు నీటి కాలువకు తోడు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు జి.సిగడాం మండలం నాగులవలస, పెంట, సీతంపేట, లింగాపురం, నక్కపేట, గేదెలపేట తదితర గ్రామాల్లో ఉభాలు మొదలైపోయాయి. జిల్లాలో ఇతర ప్రాంతాల పరిస్థితి అంత ఆశాజనకంగా లేకపోయినా ఈ ప్రాంతాల్లో మాత్రం దమ్ములు, ఆకుతీత పనులు జోరుగా సాగుతున్నాయి.

– జి.సిగడాం



నక్కపేటలో యంత్రాలతో దమ్ము చేస్తున్న దృశ్యం



సీతంపేట-పెంట గ్రామాల పరిధిలో వరి ఆకులను తీస్తున్న అన్నదాతలు



పెంట గ్రామంలో దమ్ములో ఎరువులను వేస్తున్న రైతు



పెంట-నాగులవలస గ్రామాల మధ్య వరి నాట్లు వేస్తున్న మహిళలు

అల్లుకున్న నిర్లక్ష్యం..!



చిలకపాలేం వద్ద విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగజాతి మొక్కలు



లావేరు మండలంలోని పెద్దరావుపల్లి వద్ద అల్లుకున్న తీగజాతి మొక్కలు



ఎచ్చెర్ల మండలంలోని అల్లినగరం వద్ద...

- విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగజాతి మొక్కలు
- తరుచూ విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

ఎచ్చెర్ల: నియోజకవర్గంలోని పలు విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు, చెట్టు కొమ్మలు అల్లుకుపోవడంతో నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో, ప్రధాన రహదారులకు ఆనుకుని విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకుపోయినా అధికారులు పట్టించుకోకపోవడం లేదని పలువురు అంటున్నారు. జాతీయ రహదారి నుంచి కుప్పిలి గ్రామం వెళ్లే రహదారి గుండా ఉన్న విద్యుత్ స్తంభాలకు ఈ తీగలు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకు సైతం ఈ మొక్కలు అల్లుకుపోయి ఉన్నాయి. ఇవే కాకుండా ఎచ్చెర్ల నియోజకవర్గంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకుంది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలకు ఎర్తింగ్ కూడా సక్రమంగా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు అల్లుకొని ఉన్నటువంటి తీగలకు విద్యుత్ ప్రవాహం జరిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తొలగిస్తున్నాం

ప్రస్తుతం స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగిస్తున్నాం. వీలైనంతవరకు అన్నింటినీ తొలగించే చర్యలు చేపడుతున్నాం. ఇటువంటి పరిస్థితి ఎక్కడ ఉన్నా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– హరికృష్ణ, ఎలక్ట్రికల్ ఏఈ, ఎచ్చెర్ల

చర్యలు తీసుకోవాలి



ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున తీగజాతి మొక్కలు కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోవచ్చు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ఇటీవల తరచూ విద్యుత్ సరఫరాలో హెచ్చు, తగ్గుల కారణంగా ఇళ్లలో విద్యుత్ సంబంధిత గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయి.

– రెడ్డి గోపాల్, ఆటో డ్రైవర్, చిన్నయ్యపేట, లావేరు మండలం

నిర్లక్ష్యం కనిపిస్తోంది



విద్యుత్ స్తంభాల నిర్వహణ పనుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇటీవల తరచూ మొక్కలు కటింగ్ చేపడుతున్నామని విద్యుత్ సరఫరాలను నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ చాలాచోట్ల విద్యుత్ స్తంభాలకు అల్లుకుని తీగజాతి మొక్కలు దర్శనమిస్తూనే ఉన్నాయి. అధికారులు స్పందించి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి.

– బి.దాలినాయుడు, గొల్లపేట, ఎచ్చెర్ల మండలం

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు సరికాదు



గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: లిక్కర్ స్కామ్ పేరుతో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం సరికాదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చేందుకు అక్రమ అరెస్టులకు పూనుకుంటోందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ప్రభుత్వం మద్యం దుకాణాలు నిర్వహిస్తే అవినీతికి ఆస్కారం ఎక్కడుందని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ప్రజలే తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు.

సేంద్రియ ఎరువులతో మేలు

ఎచ్చెర్ల: సేంద్రియ ఎరువులతో భూమికి మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీఏ సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని కేశవరావుపేట గ్రామంలో రైతులకు సేంద్రియ ఎరువుల తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల కంటే సేంద్రియ ఎరువులు తక్కువ ధరకు లభిస్తాయని తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా రఘురాం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వజ్జిపర్తి రఘురాం ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా సోమవారం నియమితులయ్యారు.

ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావుకు ప్రత్యేక అభిందనలు తెలిపారు.

ఆదిత్యాలయానికి రిఫ్రిజిరేటర్ వితరణ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో వినియోగానికి డబుల్ డోర్ రిఫ్రిజిరేటర్‌తో పాటు మూడు వాటర్ డిస్పెన్సర్లను నగరానికి చెందిన బరాటం మణికంఠ కుటుంబ సభ్యులు సమర్పించారు. ఆలయ ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్‌కు వీటిని అందజేశారు. భక్తుల సౌకర్యార్థం వీటిని వినియోగించాలని దాతలు కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి



ముస్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వం మొండివైఖరి విడనాడి మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాంలు కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 6వ రోజు సమ్మె సోమవారం కొనసాగింది. దీనిలో భాగంగా ఉదయం 5.30 గంటల నుంచి మున్సిపల్ కార్మికులందరూ సమ్మెలో పాల్గొని శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, సమ్మె కాలపు ఒప్పందాల జీవోలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులకు జీవో 36 ప్రకారం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ.శంకర్, డి.యుగంధర్, ఎ.శేఖర్, ఎ.మోహన్, గణేష్, ఎన్.తిరుమల, పి.మల్లమ్మ, ఎ.జ్యోతి, ఎ.గణేష్, ఆర్.శేఖర్, ఎ.రాము, దేవి, వెంకటలక్ష్మి, డి.లక్ష్మి, కె.అప్పలకొండ, పాల్గొన్నారు.

● రద్దు చేయాలని అంగన్‌వాడీల నిరసనలు

యాప్‌లతో ఆపసోపాలు



ఎచ్చెర్ల: వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎచ్చెర్ల: అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల్లో ఫేస్ యాప్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ఒక యాప్ మాత్రమే నిర్వహించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి డి.పాపినాయుడుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లు వలన లబ్ధిదారులకు సరుకులు ఇచ్చేటప్పుడు సిగ్నల్స్ లేకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలియజేశారు. అందువలన గతంలో మాదిరిగా లబ్ధిదారుల సంతకం పెట్టించుకొని సరుకులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అంగన్‌వాడీలకు తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.రాములమ్మ, జి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గారలో...

అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగ్గించాలని సీఐటీయూ నాయకుడు ఆర్.ప్రకాశరావు, ప్రాజెక్టు కార్యదర్శి జె.కాంచన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం గార ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వివిధ యాప్‌లతో ప్రభుత్వం వేధిస్తోందని, తీవ్రమైన పనిభారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో ఇచ్చిన ఫోన్లు 90 శాతం పనిచేయడం లేదన్నారు. గతంలో మాదరిగా మాన్యువల్ పద్ధతి ద్వారా సరుకులు పంపిణీ వచ్చేలా చూడాలన్నారు. అనంతరం సీడీపీవో శోభారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.పద్మలత, కె.కమలాకుమారి, మంగవేణి, రేణుక, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: ఐసీడీఎస్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

రణస్థలంలో...

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.సుజాత డిమాండ్ చేశారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రణస్థలం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.అప్పమ్మ, బి.స్వాతి, పి.నాగమణి, ఆర్.రేవతి, జి.ధనలక్ష్మి, గిరిజ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



గార: ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మహిళపై ముస్లిం మత పెద్దల ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: జి.సిగడాం మండలంలోని పాలఖడ్యాం గ్రామానికి చెందిన ముస్లిం మత పెద్దలు ఒక మహిళపై ఎస్పీ గ్రీవెన్సులో సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని మసీదుకు ఆనుకుని ఉన్న నివాస గృహంలో ఉంటున్న ఆమె వాడుక నీరు లోపలికి వదిలేయడమే కాకుండా, ఒక ఉద్యోగి ద్వారా బెదిరిస్తోందని విన్నవించారు.